ఆంధ్రజ్యోతి
5 మహబూబాబాద్
ఆదివారం 29 సెప్టెంబరు 2024






నక్సలైట్ల పేరుతో నగదు చోరీ

చిన్నగూడూరు, సెప్టెంబరు 28 : నక్సలైట్లమంటూ ఓ ఇంట్లో చొరబడి వృద్ధుడిని బెదిరించి రూ.35 వేలు చోరీ చేసిన ఘటన శుక్రవారం అర్ధరాత్రి చిన్నగూడూరు మండల కేంద్రంలో చోటు చేసుకుంది. శనివారం బాధితుడు సుధగాని వెంకటయ్య తెలిపిన వివరాల ప్రకారం. శుక్రవారం రాత్రి నలుగురు వ్యక్తులు తనఇంట్లో చొరబడి నక్సలైట్లమంటూ బాధితుడిని చెదిరించి నగదు ఎత్తుకెళ్లారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రుూనీస్ తెలిపారు.



ఎస్సైకి వివరాలను తెలుపుతున్న వెంకటయ్య

రచ్చబండ ఏడబాయె..

ఊరు ముచ్చట్లకు వేదికగా రచ్చబండలు, సావటి గద్దెలు

సెల్ లేకుంటే జీవితమే లేదనే రోజులు నేటివి.. ఖాళీగా ఉంటే సెల్‌ఫోన్ కాలక్షేపం.. పక్కవారి యోగక్షేమాలు పట్టని కాలం. పల్లె నుంచే ప్రపంచాన్ని చుట్టేసే టెక్నాలజీతో ఎదుటి వ్యక్తితో కన్నా.. సోషల్ మీడియాతోనే ఎక్కువ బంధాలను పెంచుకుంటున్న ఈ సమాజంలో ఇప్పటివరకు రచ్చబండలే పల్లె జనం మధ్య అనుబంధాలకు ప్రతీకలుగా నిలుస్తున్నాయి. నిద్ర లేచింది మొదలు.. రాత్రి పడుకునే వరకు పల్లెల్లోని సావటి గద్దె వద్ద జరిగే చర్చలెన్నో. ఊరి పంచాయతీలు, సాధక బాధలు, గ్రామంలోని సమస్యలు, భార్యాభర్తల పంచాయితీలు, పోరగాళ్ల అల్లర్లు గల్లీ నుంచి ఢిల్లీ రాజకీయాల వరకు చర్చలకు ఈ సావటి గద్దెలు వేదికగా నిలుస్తున్నాయి. పల్లె పాలిట్రిక్స్ నుంచి అమెరికా అధ్యక్ష ఎన్నికల వరకు కూడా చర్చించేందుకు రచ్చబండలే అడ్డాలు. ప్రస్తుతం అనేక గ్రామాల్లో రచ్చబండలు, సావటి గద్దెలు కనుమరుగై పోగా.. ఇంకా అక్కడక్కడా రచ్చబండల వద్ద సందడిగా కనిపిస్తున్నాయి. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని రచ్చబండ ముచ్చట్లపై ఈ ఆదివారం ప్రత్యేక కథనం..

- ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్



- గల్లీ నుంచి ఢిల్లీ వరకు అన్ని రకాల చర్చలకు కేంద్రాలు
- పంచాయితీలకు, చర్చలకు, తీర్మానాలకు స్థానాలు
- మంచి, చెడు పంచుకునేందుకు పల్లె జనానికి ధర్మశాలలు
- అభివృద్ధి, అవినీతి, సమకాలీన రాజకీయాలపై అవగాహన
- పల్లె జనం ఐక్యతకు సజీవ సాక్ష్యంగా ఊరు సావటి గద్దెలు
- టెక్నాలజీ యుగంలో పలు ప్రాంతాల్లో కనుమరుగు


శాయంపేట మండలం కొప్పులలో రచ్చబండ వేదిక




మేడారం అడవుల్లో నేలకూలిన చెట్లు (ఫైల్)

ప్రకృతి ప్రకోపం ఛేదించేనా?

- క్షణాల్లో కుంభవృష్టి వానలు.. నిమిషాల్లోనే జల ప్రళయాలు
- అడవిలో వాయుగుండాలతో పెను విధ్వంసం
- 50వేలకు పైగా చెట్లు నేలకూలినా చిన్న ప్రాణికి కూడా హాని జరగని వైనం
- వైపరిత్యాన్ని ముందే పసిగట్టిన మూగజీవాలు
- మోరంచ, కొండాయిల్లో వరదను అంచనా వేయలేకపోయిన జనం
- ఉమ్మడి జిల్లాలో ఈ వైపరిత్యాలకు కారణాలపై మొదలవుతున్న పరిశోధనలు

7

క్షణాల్లో కుంభవృష్టి వానలు.. నిమిషాల్లోనే జలప్రళయాలు.. ఎక్కడో నడి సముద్రంలో అలజడితో ఇక్కడి అడవుల్లో పెనుగాలుల విధ్వంసం... అసలు ఈ ప్రకృతి ప్రకోపానికి కారణాలు ఏంటి? ఓరుగల్లు పరిసర ప్రాంతాల్లోనే ఎందుకు ఈ విధ్వంసం జరుగుతోంది? ఇవే ఇప్పుడు పరిశోధకులను.. ప్రకృతి ప్రేమికుల మెదళ్లను తొలుస్తున్న ప్రశ్నలు. ప్రకృతి వైపరీత్యాలను జంతువులు, పక్షులు ముందే పసిగడుతున్నాయా? ఆ శక్తిలేకనే జల ప్రళయాలకు మానవులు జలసమాధి అవుతున్నారా? అనే చర్చ కూడా విస్తృతంగా జరుగుతోంది. రెండుమూడేళ్లుగా వరుసగా తలెత్తుతున్న ప్రకృతి వైపరీత్యాలు ఓరుగల్లువాసులను టెన్షన్ పెడుతున్నాయి. వీటిని ఛేదించే పనిలో శాస్త్రవేత్తలు పడ్డారు. ఈ మేరకు పరిశోధనలు ప్రారంభించారు.

- ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్

ఆర్థిక స్వావలంబనకు 'మహిళా శక్తి క్యాంటీన్లు'

- ఏర్పాటుకు ముమ్మరంగా కసరత్తులు
- కేసముద్రం మార్కెట్ ఆవరణలో సిద్ధమవుతున్న క్యాంటీన్
- రాష్ట్రస్థాయి ప్రజాప్రతినిధులతో ప్రారంభానికి సన్నాహాలు
- జిల్లాలో పది కేంద్రాలకు ప్రతిపాదనలు

కేసముద్రం, సెప్టెంబరు 28 : మహిళలకు చేయూతనిస్తూ ఆర్థిక స్వాలంబన సాధించి, వారిని లక్షాధికారులను చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం ఇందిర మహిళాశక్తి పథకం (ఐఎంహెచ్ఎస్) కింద 'మహిళా శక్తి క్యాంటీన్ల'ను ఏర్పాటు చేస్తోంది. మహిళా సంక్షేమం కోసం రాష్ట్రప్రభుత్వం ఇప్పటికే మహాలక్ష్మి పథకం ద్వారా ఉచిత ఆర్టీసీ బస్సు ప్రయాణం, రూ.500లకే గ్యాస్ సిలెండర్ ఇస్తుండగా గృహజ్యోతి పథకం కింద 200 యూనిట్ల వరకు విద్యుత్‌ను ఇంటింటికి ఉచితంగా అందిస్తున్నారు. ఈ క్రమంలోనే మహిళా సంఘాలను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు తాజాగా మహిళా శక్తి క్యాంటీన్లను ప్రభుత్వం ఏర్పాటు చేస్తోంది. మహిళా శక్తి క్యాంటీన్లు ఒక బ్రాండ్‌గా ఎదగాలని, దేశానికే ఆదర్శంగా నిలవాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఈ పథకాన్ని రూపొందించింది. జనం రద్దీ ఎక్కువగా ఉండే బస్టాండ్లు, పారిశ్రామిక, పర్యాటక ప్రాంతాలు, దేవాలయాలు, ప్రభుత్వ కార్యాలయాల వద్ద మహిళా శక్తి క్యాంటీన్లను ఏర్పాటు చేయనున్నారు. జిల్లా కేంద్రంతో పాటు వివిధ మండలాల్లో క్యాంటీన్ల ఏర్పాటుకు ప్రభుత్వం రంగం సిద్ధం చేస్తోంది. ప్రస్తుతం మహబూబాబాద్, కేసముద్రం, డోర్నకల్‌లోని ఐదుమహిళా శక్తి క్యాంటీన్లు ప్రారంభానికి సిద్ధమవుతున్నాయి. ముని సిపాలిటీ ప్రాంతాల్లో పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా), ఇతర ప్రాంతాల్లో గ్రామీణ పేదరిక నిర్మూలన సొసైటీ (సెర్ప్) పర్యవేక్షణలో ఈ క్యాంటీన్ల ఏర్పాటు కొనసాగుతోంది.


కేసముద్రం మార్కెట్ ఆవరణలో సిద్ధమవుతున్న మహిళా శక్తి క్యాంటిన్

మహిళా సంఘానికే రుణం..

మహిళా శక్తి క్యాంటీన్ల ఏర్పాటు కోసం స్వయం సహాయక సంఘాల (ఎస్‌హెచ్‌జీ)కు బ్యాంకు, మహిళా సమాఖ్య ద్వారా రుణాలు మంజూరు చేస్తున్నారు. బ్యాంకు నుంచి ఎలాంటి పూచీకత్తు లేకుండా మహిళా శక్తి క్యాంటీన్ ఏర్పాటు కోసం రుణం ఇస్తున్నారు. అలాగే ప్రభుత్వ కార్యాలయాలు ఉన్న చోట అద్దె లేకుండా క్యాంటీన్ ఏర్పాటుకు గదులను ఇప్పిస్తున్నారు. క్యాంటీన్ ఏర్పాటు

మిగతా 8వ పేజీలో..

పోలీసులు ప్రజలకు అందుబాటులో ఉండాలి

- డయల్ 100కు స్పందించకుంటే చర్యలు
- ఎస్పీ సుధీర్‌రామ్‌నాథ్ కేకన్

తొర్రూరు, సెప్టెంబరు 28 : ప్రజలకు అందుబాటులో ఉంటూ లాఅండ్‌ఆర్డర్‌ను కంట్రోల్‌లో ఉండేందుకు పోలీసులు సత్వర చర్యలు చేపట్టాలని ఎస్పీ సుధీర్‌రామ్‌నాథ్ కేకన్ అన్నారు. శనివారం తొర్రూరులోని పోలీస్‌స్టేషన్‌ను ఆకస్మిక తనిఖీ చేసి, రికార్డులు పరిశీలించి పలు కేసుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. రికార్డుల నిర్వహణపై సిబ్బందికి తగు సూచనలు చేశారు. డయల్ 100కు ఫోన్ రాగానే స్పందించి బాధితులకు న్యాయం చేయాలన్నారు. విధుల్లో ఉండి స్పందించని సిబ్బందిపై చర్యలు తప్పవన్నారు. పెండింగ్ కేసులను సత్వరమే పరిష్కరించాలని, స్టేషన్ పరిధిలో రోడ్డు ప్రమాదాలు జరగకుండా ప్రజలకు అవగాహన కల్పిస్తూ నివారణ చర్యలు చేపట్టాలని, సైబర్ నేరాల బారిన పడకుండా అవగాహన కల్పించాలని తెలిపారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. ఉన్నతాధికారుల నిబంధనల మేరకు పోలీస్ స్టేషన్‌లో రికార్డులు క్రమపద్ధతిలో అమర్చుకోవాలని, సర్కిల్ వారీగా అధికారులు సిబ్బంది విధులు బాధ్యతగా నిర్వర్తించాలని, పోలీసులకు, ప్రజలకు మధ్య ఫ్రెండ్లీ పోలీస్‌గా వ్యవహరించాలన్నారు. ఈ కార్యక్రమంలో సీఐ జగదీష్, ఎస్సైలు ఉపేందర్, రామ్‌జీ నాయక్, సిబ్బంది తదితరులు ఉన్నారు.


ఎస్సైలకు సూచనలిస్తున్న సుధీర్‌రామ్‌నాథ్ కేకన్

విద్యార్థుల నైపుణ్యాలను వెలికి తీయాలి

- కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్

మహబూబాబాద్, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో దాగివున్న ప్రతిభ నైపుణ్యాలను వెలికి తీయాలని, అందుకు అనుగుణంగా ఉపాధ్యాయులు బోధన చేయాలని కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్ సూచించారు. మహబూబాబాద్ పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం జిల్లా యువజనోత్సవాలను జ్యోతి ప్రజ్వలనచేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వామి వివేకనంద జయంతి ఉత్సవాల సందర్భంగా దేశవ్యాప్తంగా జాతీయ, రాష్ట్ర, జిల్లాస్థాయిల్లో యువజనోత్సవాలు నిర్వహిస్తున్నారని, అందులో భాగంగానే జిల్లా కేంద్రంలో కార్యక్రమాలు జరుగుతున్నాయని చెప్పారు. 15 నుంచి 29 సంవత్సరాల వయస్సు కలిగిన యువతీయువకులు ఈ పోటీల్లో పాల్గొన్నారని చెప్పారు. ఆరు విభాగాల్లో ఫోక్ సింగింగ్, డ్యాన్సింగ్, వ్యాసరచన పోటీలు, సోలో పర్ఫామెన్స్, లైవ్ కార్యక్రమాలు నిర్వహించి యువతలోని ప్రతిభను గుర్తించి రాష్ట్రస్థాయికి ఉత్తమ ప్రదర్శన కోసం పంపించడం జరుగుతుందన్నారు. జిల్లా అదనపు కలెక్టర్ లెనిన్‌వత్సల్ టొప్పో, జిల్లా అధికారులు సురేష్, అనిల్‌కుమార్, వి.రాజేశ్వర్ పాల్గొన్నారు.


విద్యార్థులతో మాట్లాడుతున్న అద్వైత్‌కుమార్‌సింగ్

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

వసతి గృహాల్లో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్ అన్నారు. కలెక్టర్ కార్యాలయంలో జిల్లాలోని వెనుకబడిన తరగతులు, సాంఘిక సంక్షేమ శాఖ వసతి గృహాలపై సంబంధిత అధికారులతో శనివారం సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వసతి గృహాల్లో శానిటేషన్ పక్కాగా నిర్వహించాలని, మెనూ ప్రకారం భోజనాన్ని అందించాలన్నారు. వసతి గృహాలకు ప్రత్యేక అధికారులను నియమించి హాస్టల్ నిద్ర కార్యక్రమాలు, హాస్టళ్లలో తనిఖీలు నిర్వహించడం జరుగుతుందన్నారు. జిల్లా అదనపు కలెక్టర్ లెనిన్‌వత్సల్ టొప్పో, నర్మద, నర్సింహాస్వామి పాల్గొన్నారు.



'రేషనలైజేషన్ జీవోను సవరించాలి'

తొర్రూరు, సెప్టెంబరు 28 : తరగతికి ఒక ఉపాధ్యాయుడు ఉండాలని ప్రభుత్వం విడుదల చేసిన జీవో నంబర్ 25ను వెంటనే రద్దుచేయాలని ఐక్య ఉపాధ్యాయ సంఘం నాయకులు డిమాండ్ చేశారు. శనివారం తొర్రూరులో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా యూటీఎఫ్, టీపీటీఎఫ్, డీటీఎఫ్ బాధ్యులు మాట్లాడారు. ప్రాథమిక పాఠశాలలో 11మంది విద్యార్థులకు ఇద్దరు ఉపాధ్యాయులు, 60 మంది విద్యార్థులకు ఇద్దరు ఉపాధ్యాయులను కేటాయించాలన్న నిబంధన సరైంది కాదని, 40 నుంచి 60 మంది వరకు ముగ్గురు ఉపాధ్యాయులను కేటాయించాలని డిమాండ్ చేశారు. నేటి సామాజిక పరిస్థితులను పరిగణలోకి తీసుకుని ప్రతి పాఠశాలలో 25 మంది విద్యార్థులకు ఒక సెక్షన్ ఏర్పాటుచేసి జీవో నంబర్ 25ను సవరించాలన్నారు. ఉపాధ్యాయుల సర్దుబాటు ప్రక్రియ, బదిలీ అయిన ఎస్‌జీటీల ద్వారానే రిలీవ్ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు మురళీకృష్ణ, టీపీటీఎఫ్ ఎస్.ఐలయ్య, కొలుపుల శ్రీనివాస్, సూరం ఉపేందర్ రెడ్డి, డీటీఎఫ్ తుమ్మ వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు జనార్ధన్, నాగ మల్లయ్య, దుర్గయ్య, యాకన్న, రవి, జ్యోతి, సరస్వతి పాల్గొన్నారు.


తొర్రూరులో నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయ సంఘాల నాయకులు

రాజీ మార్గమే రాజ మార్గం

- సీనియర్ సివిల్ జడ్జి సురేష్

మహబూబాబాద్ రూరల్, సెప్టెంబరు28 : రాజీమార్గమే రాజమార్గమని జాతీయ లోక్ అదాలత్‌లో కేసులు రాజీ చేసుకోవడం వల్ల ఇరుపక్షాలు గెలిచినట్లేనని మహబూబాబాద్ జిల్లా కోర్టు సీనియర్ సివిల్ జడ్జి సురేష్ అన్నారు. మహబూబాబాద్ జిల్లా కోర్టు ఇన్‌చార్జి ప్రధాన న్యాయమూర్తి బి.రవీంద్ర శర్మ ఆదేశాల మేరకు జిల్లా కోర్టులో శనివారం లోక్‌అదాలత్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లోక్‌అదాలత్‌లో 83 బ్యాంకు కేసులకు గాను రూ.14,63,000, టెలిఫోన్ రంగానికి సంబంధించి 14 కేసులకు గాను రూ.1,753, సైబర్ నేరాలకు సంబంధించిన 24 కేసులకు గాను రూ.7,78,971, పిటి 649 కేసులకు గాను రూ.1,63,345 పరిష్కరించి, జరిమానా విధించినట్లు చెప్పారు. విద్యుత్ చౌర్యం 269 కేసులకు గాను రూ.3,18,000, క్రిమినల్‌కు సంబంధించి 715 కేసులకు రూ.3,27,900, మోటార్ ప్రమాదానికి సంబంధించి 15 కేసులకు గాను రూ.1,18,63,000, సివిల్‌కు సంబంధించి 5 కేసులకు గాను రూ.11,60,000 మొత్తంగా 1780 కేసులు పరిష్కరించి రూ.1,33,50,900 జరిమానాలు విధించినట్లు చెప్పారు. జూనియర్ సివిల్ జడ్జీ తిరుపతి, బార్ అసోసియేషన్ అధ్యక్షులు కీసర పద్మాకర్‌రెడ్డి, జిల్లా కోర్టు పబ్లిక్ ప్రాసిక్యూటర్ చిలుకమారి వెంకటేశ్వర్లు, జిల్లాకోర్టు పరిపాలన అధికారి క్రాంతికుమార్, న్యాయవాదులు, పోలీస్ అధికారులు, కోర్టు కానిస్టేబుళ్లు, కక్షిదారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మానుకోట జిల్లా కోర్టు సీనియర్ సివిల్ జడ్జి సురేష్

'లోక్ అదాలత్‌లను వినియోగించుకోవాలి'

- తొర్రూరు : సత్వర సమస్యల పరిష్కారం కోసం లోక్ అదాలత్‌లను వినియోగించుకోవాలని తొర్రూరు జూనియర్ సివిల్ జడ్జి మట్ట సరిత అన్నారు. కోర్టు ఆవరణలో జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. ఈ లోక్ అదాలత్‌లో క్రిమినల్ రాజీ అయిన కేసులు 61, క్రిమినల్ జరిమానా విధించిన కేసులు 21, పెట్టీ, డ్రంక్‌అండ్‌డ్రైవ్ కేసులు 985, సైబర్ క్రైమ్ కేసులు 18, బ్యాంక్ రికవరీ కేసులు 6, ఎక్సైజ్ కేసులు 15, మొత్తం 1106 కేసులకు గాను రూ.12 లక్షల 80వేల జరిమానా విధించామని సరిత వివరించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ వి.రేవతిదేవి, బార్‌అసోసియేషన్ జనరల్ సెక్రెటరీ గణపురం రామకృష్ణ, బెంచ్ మెంబర్‌లు కృపావతి, సీఐ జగదీష్, వివిధ పోలీస్ స్టేషన్‌ల ఎస్సైలు, న్యాయవాదులు, బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.



విద్యార్థులు మొబైల్ ఫోన్‌లకు దూరంగా ఉండాలి

▸▸ షైన్ విద్యాసంస్థల చైర్మన్ మూగల కుమార్ యాదవ్


మాట్లాడుతున్న మూగల కుమార్ యాదవ్

నయీంనగర్/హన్మకొండ, సెప్టెంబరు 28: విద్యార్థులు మొబైల్ ఫోన్లు, ఇంటర్‌నెట్, సామాజిక మాధ్యమాలకు దూరంగా ఉండాలని షైన్ విద్యాసంస్థల చైర్మన్ మూగల కుమార్ యాదవ్ అన్నారు. షైన్స్ విద్యాసంస్థల ఆధ్వర్యంలో హనుమకొండ హంటర్ రోడ్‌లోని డీకన్వెన్షన్ హాల్‌లో శనివారం ఫ్రెషర్స్‌డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలు ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులు డాన్స్‌లు చేస్తూ, పాటలు పాడుతూ ఉత్సాహంగా గడిపారు. అనంతరం చైర్మన్ కుమార్ యాదవ్ మాట్లాడుతూ.. విద్యార్థులు కష్టపడి చదివి ఉపాధ్యాయులకు, తల్లిదండ్రులకు మంచి గుర్తింపు తీసుకురావాలన్నారు. కష్టపడి చదివిన విద్యార్థులే భవిష్యత్‌లో ఉన్నత స్థాయిలో ఉంటారన్నారు. వేడుకలలోషైన్ విద్యాసంస్థల డైరెకర్లు పి.రాజేంద్ర కుమార్, జక్కుల శ్రీనివాస్, మూగల రమ, మూగల రమేష్ యాదవ్, ప్రిన్సిపల్స్ మారబోయిన రాజుగౌడ్, కె.శ్రీనివాసన్, ప్రశాంత్, సంధ్య, అధ్యాపక బృందం, విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోండి

▸▸ హనుమకొండ, వరంగల్ జిల్లా జడ్జిలు

▸▸ లోక్ అదాలత్‌లో 11,618 కేసుల పరిష్కారం

వరంగల్ లీగల్, సెప్టెంబరు 28: రాజీ మార్గం ద్వారా కక్షిదారులు కేసులు పరిష్కరించుకోవాలని, తద్వారా వివాదాలకు స్వస్తి పలకాలని వరంగల్, హనుమకొండ జిల్లా జడ్జిలు బీవీ నిర్మల గీతాంబ, హనుమకొండ జిల్లా ఇన్‌చార్జి జడ్జి అపర్ణాదేవి సూచించారు. శనివారం జాతీయ లోక్ అదాలత్‌లో వారు పాల్గొని స్నేహపూర్తిత వాతావరణంలో ఇరు పక్షాలకు ఆమోద యోగ్యమైన తీర్పు ద్వారా పరిష్కారం పొందాలని వారు సూచించారు. పలు మార్లు కోర్టుల చుట్టూ తిరుగుతూ వ్యయ ప్రయాసాలకు పాల్పడకుండా జాతీయ లోక్ అదాలత్ సహకరిస్తుందని వారు పేర్కొన్నారు. కక్షిదారుల కేసుల పరిష్కారంలో న్యాయవాదులు, పోలీసులు సహకరించాలని న్యాయమూర్తులు సూచించారు.

కాగా, జాతీయ లోక్ అదాలత్ ఆదేశానుసారం నిర్వహించిన ఉమ్మడి జిల్లాల జాతీయ లోక్ అదాలత్‌లో 11,618 కేసులు పరిష్కరించారు. వరంగల్ జిల్లాలో 9 బెంచిలను ఏర్పాటు చేసి 106 సివిల్ కేసులు, 66 రోడ్డుప్రమాద బీమా కేసులు, 3,771 క్రిమినల్ కేసులు, బ్యాంకు పీఎల్‌సీ కేసులు 40 పరిష్కరించారు. అదే విధంగా 2,311 విద్యుత్ శక్తి పీఎల్‌సీ కేసులు కూడా పరిష్కరించారు. హనుమకొండ జిల్లాలో 8 బెంచిలు ఏర్పాటు చేసి సివిల్ కేసులు ఏడు, ఎంటీవోపీ కేసులు 67, 7625 క్రిమినల్ కేసులు, బ్యాంకు పీఎల్‌సీ కేసులు 42 పరిష్కరించారు. జాతీయ లోక్ అదాలత్ సందర్భంగా లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో కక్షిదారులకు పులిహోర ప్యాకెట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో హనుమకొండ, వరంగల్ జిల్లాల అదనపు జిల్లా జడ్జిలు, సీనియర్ సివిల్ జడ్జిలు, జూనియర్ సివిల్ జడ్జిలు తమతమ బెంచిల ద్వారా కేసులు పరిష్కరించి సహకరించారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు, పోలీసులు, బ్యాంకు అధికారులు, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

కాజీపేటలో బాలుడి కిడ్నాప్

▸▸ దర్యాప్తు చేస్తున్న పోలీసులు


వివరాలు తెలుపుతున్న బాధితులు

కాజీపేట, సెప్టెంబరు 28 : భార్యభర్తల గొడవ పడుతుండగా.. ఇదే అదునుగా భావించిన ఓ జంట.. బాలుడిని తీసుకుని ఉడాయించారు. బాధితులు పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి తమ కుమారుడిని ఎవరో ఎత్తుకెళ్లారని ఫిర్యాదు చేశారు. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. వరంగల్ రంగశాయిపేటకు చెందిన ఎస్‌కే మసూద్, కౌసర్ దంపతులకు అయాన్, ఇఫ్తార్ ఇద్దరు కుమారులు. కుమారులను తీసుకుని శుక్రవారం జనగామకు వెళ్లేందుకు కాజీపేట రైల్వేస్టేషన్‌కు వచ్చారు. అప్పటికే రైళ్లు వెళ్లిపోవడంతో బస్సులో వెళ్లేందుకు కాజీపేట చౌరస్తా సమీపంలోకి వచ్చారు. ఈ క్రమంలో భార్యాభర్తల మధ్య గొడవ చోటుచేసుకుంది. భార్య కౌసర్ తన చిన్నకుమారుడు ఇఫ్తార్‌ను తీసుకుని కాస్త ముందుకు వెళ్లింది. మసూద్ తమ ఐదేళ్ల పెద్ద కుమారుడు అయాన్‌ను అక్కడే ఉన్న ఓ జంటకు అప్పగించి భార్యను వెనక్కి తీసుకురావడానికి వెళ్లాడు. అతడు భార్యను తీసుకువచ్చేలోపు పెద్దకుమారుడిని అప్పగించిన దంపతులు బాబును తీసుకుని ఉడాయించారు. బాధితులు కాజీపేట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అక్టోబరు 2న జిల్లా స్థాయి చెస్ టోర్నీ

వరంగల్ స్పోర్ట్స్, సెప్టెంబరు 28: తెలంగాణ చెస్ అసోసియేషన్ సహకారంతో వరంగల్ చెస్‌సమాఖ్య ఆధ్వర్యంలో అక్టోబర్ 2న హనుమకొండ కేఎల్ఎన్ రెడ్డి కాలనీలోని తుషార హైస్కూల్‌లో జిల్లాస్థాయి చెస్ టోర్నమెంట్ నిర్వహించనున్నట్లు క్రీడా పోటీల నిర్వహణ కార్యదర్శి కన్నా ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి వరంగల్ స్థాయి అండర్-15 బాల బాలికల విభాగంలో నిర్వహించనున్న రెండోర్యాంకింగ్ చెస్ టోర్నీలో 1జనవరి 2009 సంవత్సరం, ఆ తరువాత జన్మించి వారు అర్హులని తెలిపారు. ఇక్కడ జిల్లా స్థాయిలో విజేతలుగా నిలిచిన క్రీడాకారులకు ట్రోఫీలు, సర్టిఫికెట్లను ప్రధానం చేయడం జరుగుతుందన్నారు. మరిన్ని వివరాలకై 9059522986 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

రచ్చబండ ఏడబాయె..

- ఊరు ముచ్చట్లకు వేదికగా రచ్చబండలు, సావటి గద్దెలు
- గల్లీ నుంచి ఢిల్లీ వరకు అన్ని రకాల చర్చలకు కేంద్రాలు
- టెక్నాలజీ యుగంలో పలు ప్రాంతాల్లో కనుమరుగు

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్)

పల్లె అంటేనే ఐక్యతకు మారు పేరు. నక్సలిజం, కమ్యూనిజం, కాషాయిజం అన్ని ఇజాలు కలిసిన ప్రజలు సహజీవనం చేసే ఓరుగల్లులో ప్రతీ గ్రామానికి ఓ ప్రత్యేకత ఉంది. ఒకప్పుడు ఊరూరా రచ్చబండలు, సావటి గద్దెలు, ధర్మశాలలు ఉండేవి. నక్సలైట్ల ప్రాబల్యం ఉన్న గ్రామాలతో పాటు మైదాన ప్రాంతాల పల్లెలోనే ఉదయం నుంచి రాత్రి వరకు ప్రజలకు కాలక్షేపంగా కూడా రచ్చబండలు పనిచేసేవి. ఎప్పుడూ ఓ పదిమంది సావటి గద్దె, రచ్చబండలపై కూర్చుని ఊరుముచ్చట్లతో పాటు రైతు సమస్యలు, రాజకీయాల గురించి మాట్లాడుకోవటం ప్రతీ ఊళ్లో కనిపించే దృశ్యాలే. పండుగలొచ్చినా.. పబ్బలొచ్చినా.. గ్రామంలో ఏ సంఘటన జరిగినా సమాచారం మొత్తం ఈ రచ్చబండలకు చేరేది. ఊళ్లో ఏ గల్లీలో చిన్న గొడవలైనా, భార్యాభర్తల పంచాయితీ అయినా సరే.. సావటిల్లో చర్చనీయాంశంగా మారేది. ఇప్పుడే సాంకేతికత బాగాపెరిగిపోడటంతో యువతతోపాటు నడివయస్సు వారు కూడా సెల్‌ఫోన్‌లకు అతుక్కుపోతున్నారు. పక్కోడి కష్టం కంటే సెల్‌లో సోల్లుకే ప్రాధాన్యత ఇస్తున్నారు. అయినప్పటికీ అక్కడక్కడా అనేక గ్రామాల్లో ఇంకా ఈ రచ్చబండ సంస్కృతి దర్శనిమిస్తుండగా, మరికొన్ని చోట్ల సావటిలు వెలవెల పోతున్నాయి.


శాయంపేట మండలం హుస్సేన్‌పల్లిలో రచ్చబండ వేదిక

రచ్చబండలపై సమయం తెలిసేది కాదు..

కసిరెడ్డి రఘోత్తంరెడ్డి, నవాబుపేట

గ్రామాల్లో పాత రోజులే బాగుండేవి. మా గ్రామంలో అప్పటి సర్పంచ్ కాల్వ లక్ష్మారెడ్డి ఇంటి వద్ద రచ్చబండ ఉండేది. అక్కడ కూర్చుంటే సమయం తెలిసేది కాదు. కథలు, నాటికలు, గ్రామ సమస్యలు, తగాదాల పరిష్కారాలతో సమయం తెలిసేది కాదు. ప్రతి రోజూ ఉదయం, సాయంత్రం రచ్చబండ కాడ కూర్చొని ఒకరి ఇబ్బందులు, సమస్యలు మరొకరితో చెప్పుకునే వాళ్లం. ఉమ్మడి కుటుంబాలు ఉండటంతో అందరూ కలిసి ముచ్చట్లు చెప్పుకునేటోళ్లం. ఇప్పుడు స్వార్థాలు పెరిగాయి. కాలక్షేపానికి నలుగురితో కలిసి ముచ్చటించే సమయం దొరకడంలేదు. అలాంటి ప్రత్యేక స్థలాలు లేవు.



\- చిట్యాల

చెట్టు కిందే అన్ని సమస్యలకు పరిష్కారం

రచ్చబండ అంటే సామాన్యంగా భారీ చెట్ల కింద ఏర్పాటు చేసే పంచాయితీ కేంద్రం గ్రామస్థులు కలుసుకునే ప్రదేశంగా, వారి సమస్యలను చర్చించే వేదికగా, పంచాయతీ కార్యక్రమాలు నిర్వహించే ప్రదేశంగా ఇవి ఉపయోగపడేది. చాలా గ్రామాల్లో రచ్చబండలు ఉండేవి. అక్కడ వెలువడే తీర్పును ప్రజలు పరమావధిగా భావించేవారు. విడాకులు, వరకట్నం, భూపంచాయతీలు, ప్రేమ వివాహాలు, గట్ల పంచాయతీ ఇలా రోజు ఊరిలో జరిగే ఏదో వివాదాన్ని అక్కడ పరిష్కరించేవారు. ఇరు వర్గాలకు రాజీ కుదిర్చేవారు.

\- వెంకటాపూర్(రామప్ప)

గ్రామాభివృద్ధి చర్చలకు వేదికలుగా ఉండేవి

కత్తాల రాంచందర్‌రావు, ధర్మరావుపేట



నా చిన్ననాటి హయాంలో గ్రామాలు, తండాల్లో పెద్దపెద్ద వృక్షాల కింద చావడిలు, రచ్చబండలు ఉండేవి. నాడు గ్రామపెద్దలు, వృద్ధులు రచ్చబండల వద్ద కాలక్షేపంతో పాటు ఊరు బాగోగుల కోసం ఉదయం, సాయంత్రం వేళ్లలో ఒక్కచోట పోగై చర్చించుకునేవారం. రాజకీయాలపై చర్చలు జరిగేవి. ఒకొక్కరి బాగోగులు, యోగక్షేమాలు సైతం చర్చింకునేవాళ్లం. దీంతో గ్రామస్తుల మధ్య ఐక్యత, ఆపాయ్యత పెరిగేది. నేడు ఉరుకుల పరుగుల జీవితంతో పాటు, ఆధునిక సాంకేతికత పెరగడంతో టీవీలు, సెల్‌పోన్ల వినియోగం పెరగడంతో ఎవరి ఇంట్లో వారే ఉంటున్నారు. అదేవిదంగా గ్రామాల నుంచి ఉపాధి కోసం పట్నాలవైపు వెళ్తుండటంతో రచ్చబండలు, గ్రామాల్లోని ప్రధాన కూడల్లోని చావడీలు కనుమరుగయ్యాయి.

\- ఖానాపురం

ఆనాటి ముచ్చట్లు ఏమాయే..

వెలవెలబోతున్న రచ్చబండ వేదికలు

గ్రామీణ ప్రాంతాల్లో రచ్చబండ ముచ్చట్లు కాలక్రమేణా మాయమై పోతున్నాయి. గ్రామంలో ఏ నలుగురు కలిసినా సహజంగా మర్రి, వేప, రాల చెట్ల కింద రచ్చబండపై కూర్చుని, ముచ్చట్లు పెట్టుకుంటూ కాలక్షేపం చేసేవారు. ఊరు సంగతులు.. వ్యవసాయం ఎట్లా ఉంది.. పిల్లగాండ్లు ఏడ సదువుతున్నారు.. ఏం చేస్తున్నారు.. గ్రామంలో సమస్యలు.. నాయకుల పనితీరు.. గ్రామం నుంచి జాతీయస్థాయి వరకు రాజకీయపార్టీల అనుకూల, వ్యతిరేక విషయాలు ఇలా అనేక విషయాలను చర్చించుకునేవారు. ఇవే కాకుండా కుటుంబ, గ్రామ, భూమి, తదితర తగాదాలను సైతం రచ్చబండల ద్వారా పరిష్కరించుకున్న సందర్భాలు అనేకం. ఇలాంటి నేపథ్యమున్న రచ్చబండలు క్రమేణా గ్రామస్తుల ముచ్చట్లకు దూరమయ్యాయి. సాంకేతిక పెరగడంతో పిల్లల నుంచి మొదలు వృద్ధుల వరకు స్మార్ట్ ఫోన్, టీవీ, కంప్యూటర్లకు అలవాటు పడిపోయారు. ఒకరితో మరొకరు సమయం గడపడమే మర్చిపోతున్నారు.

మాట్లాడుకుంటూ రేడియోలో వార్తలు వినేవాళ్లం

బయ్య సాంబయ్య, కొప్పుల



గ్రామస్తులంతా రచ్చబండపై కూర్చుని అన్ని విషయాలు మాట్లాడుకుంటూ.. రేడియోలో వార్తలు విని, ఆ వార్తలపై చర్చించుకునేవాళ్లం. కానీ నేడు రచ్చబండ వద్దకు రావడానికి కూడా ఎవరికీ సమయం లేకుండా పోయింది. భవిష్యత్తు తరాలకు రచ్చబండ అనే పదమే తెలియని పరిస్థితి నెలకొంది.

ఆ రోజులే బాగుండేవి..

భూతాల వీరయ్య, హుస్సేన్‌పల్లి



గ్రామంలోని విషయాలన్నీ రచ్చబండపై కూర్చుని ఒకే కుటుంబంలాగా రాత్రి పొద్దుపోయేవరకు మాట్లాడుకునే వాళ్లం. ఇప్పుడు అలాంటి పరిస్థితి లేదు. ఆరోజులే బాగుండేవి. నేడు కనీస పలకరింపులే కరువయ్యాయి.

\- శాయంపేట

పండుగ రోజుల్లో రైల్వే ప్రయాణికులకు కొత్త కష్టాలు

- కాజీపేటలో ఇంటర్‌లాక్ పనులు
- 47 పండుగ స్పెషల్ రైళ్లు రద్దు
- అక్టోబరు 2 నుంచి తిరుపతికి స్పెషల్ రైలు


కాజీపేట రైల్వే స్టేషన్‌లో రద్దీ

కాజీపేట, సెప్టెంబరు 28: దసరా, దీపావళి పండుగ రోజులు వస్తున్నాయి. అక్టోబరు 2నుంచి విద్యా సంస్థలకు సెలవులు మెదలుకానున్నాయి. సొంతూళ్లకు వెళ్లే రైల్వే ప్రయాణికులకు ఈసారి కొత్త కష్టాలు వచ్చి పడ్డాయి. హసన్‌పర్తి-వరంగల్, హసన్‌పర్తి-కాజీపేట మీదుగా బైపాస్ రైల్వే లైన్ల నిర్మాణంతో ఈ రూట్లలో పండుగకు ప్రకటించిన 47 ప్రత్యేక రైళ్లను రద్దు చేశారు. దీంతో గూడ్స్ రైళ్లను రీ షెడ్యూల్ చేసి మరీ ప్రత్యేకంగా పండుగ రైళ్లను అతి కష్టం మీద కొన్ని రైళ్లను నడపడానికి ప్రణాళికలు చేస్తున్నారు. 38 రైళ్లను దారి మళ్లించి నడుపుతున్నారు. అసలే ప్రత్యేక రైళ్లు సరిపోని తరుణంలో 47 పండుగ స్పెషల్ రైళ్లు రద్దు కావడంతో సొంత ఊళ్లకు వెళ్లే ప్రయాణికులకు మరిన్ని కష్టాలు తప్పేలా లేవు.

దసరాకు కాజీపేట మీదుగా తిరుపతికి ప్రత్యేక రైళ్లు

అక్టోబరు 2 నుంచి కాజీపేట మీదుగా సికింద్రాబాద్-తిరుపతి-సికింద్రాబాద్ మీదుగా 28 సర్వీస్‌లను నడిపించడానికి అన్ని ఏర్పాట్లు చేశారు. (07041) సికింద్రాబాద్ - తిరుపతి మధ్య నడిచే ఈ స్పెషల్ రైళ్లు అక్టోబరు 2, 4, 9, 11, 16, 18, 23, 25, 30, నవంబరు 1, 6, 8, 13, 15 వ తేదీల్లో నడవనుంది, ఈ రైలు సికింద్రాబాద్‌లో సాయంత్రం 5.50 నిమిషాలకు బయలుదేరి కాజీపేట జంక్షన్‌కు సాయంత్రం 7.52కు చేరకుంటుంది. (07042) తిరుపతి - సికింద్రాబాద్ స్పెషల్ రైలు అక్టోబరు 3, 5, 10, 12, 17, 19, 24, 28, 31, నవంబరు 2, 7, 9, 14, 16, తేదీల్లో నడవనుంది. ఈ రైలు నిర్ణయించిన తేదీల్లో తిరుపతిలో ఉదయం 9.40 నిమిషాలు బయలుదేరి మరునాడు ఉదయం 5.23కు కాజీపేటకు చేరుకుంటుంది. ఈ స్పెషల్ రైళ్లకు అప్ అండ్ డౌన్ రూట్లలో కాజీపేట, వరంగల్, మహబూబాబాద్, డోర్నకల్, ఖమ్మం, మధిర, కొండపల్లి, విజయవాడ, తెనాలి, చీరాల, ఒంగోలు, నెల్లూరు, గూడూరు, రేణిగుంట స్టేషన్లలో హాల్టింగ్ సౌకర్యం కల్పించారు.

ప్రతీ సోమవారం గచ్చిబౌలికి ప్రత్యేక బస్సు

బాలసముద్రం, సెప్టెంబరు 28: వరంగల్, హనుమకొండ నుంచి పెద్ద సంఖ్యలో ఉద్యోగులు గచ్చిబౌలి ప్రాంతానికి ప్రయాణిస్తుంటారని, వారికి సౌకర్యంగా ప్రతీ సోమవారం హనుమకొండ నుంచి గచ్చిబౌలికి ప్రత్యేక రాజధాని బస్సు సర్వీసును ప్రారంభిస్తున్నట్లు వరంగల్-1 డిపో మేనేజర్ వంగల మోహన్‌రావు తెలిపారు. ఈ బస్సు ప్రతీ సోమవారం ఉదయం 5గంటలకు హనుమకొండ నుంచి బయలుదేరి ఉప్పల్, జేబీఎస్, కూకట్‌పల్లి, జేఎన్‌టీయూ, హైటెక్‌సిటీ, గచ్చిబౌలి వరకు చేరుకుంటుందని టికెట్ ధర రూ.450 అని, ముందస్తుగా రిజర్వేషన్ చేసుకోవచ్చని ఆయన తెలిపారు. ఉద్యోగస్థులు ఈ సౌకర్యాన్ని వినియోగించుకోవాలని డీఎం కోరారు.

ప్రకృతి ప్రకోపం ఛేదించేనా?

- క్షణాల్లో కుంభవృష్టి వానలు.. నిమిషాల్లోనే జల ప్రళయాలు
- అడవిలో వాయుగుండాలతో పెను విధ్వంసం
- 50వేలకు పైగా చెట్లు నేలకూలినా చిన్న ప్రాణికీ హాని జరగని వైనం
- ఉమ్మడి జిల్లాలో ఈ వైపరిత్యాలకు కారణాలపై చర్చోపచర్చలు

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్)

కొన్నేళ్లుగా ఓరుగల్లు పరిసరాల్లో ప్రకృతి విధ్వంసం దేనికి సంకేతాలనే చర్చ జరుగుతోంది. ఆగస్టు 31న సాయంత్రం మేడారం అడవుల్లో ఏకకాలంలో కుంభవృష్టి వానతో పాటు పెనుగాలులు సృష్టించిన బీభత్సం పర్యావరణ శాస్త్రవేత్తలను సైతం ఆశ్చర్యపరుస్తోంది. ఈ ప్రకృతి విధ్వంసం వెనుక ఉన్న రహస్యాలను కనుగొనేందుకు శాస్త్రీయ కారణాలపై శాస్త్రవేత్తలు విస్తృతంగా పరిశోధనలు చేస్తున్నారు. అటవీశాఖ ఉన్నతాధికారులు, ఫారెస్ట్ రిటైర్డ్ అధికారులు, జాతీయ వాతావరణ పరిశోధన ప్రయోగశాల (ఎన్ఏఆర్ఎల్) ఎన్‌జీఆర్ఐ, నేషనల్ రిమోట్ సెన్సింగ్ సెంటర్ (ఎన్ఆర్ఎస్‌సీ), ఐఎండీ శాస్త్రవేత్తలు టోర్నడోలపై అధ్యయనం చేస్తున్నారు. వరంగల్ నిట్, కాకతీయ యూనివర్సిటీ ప్రొఫెసర్లు సైతం ఈ ప్రకృతి విధ్వంసం వెనుక ఉన్నకారణాలను తెలుసుకునే పనిలో పడ్డారు.

వాస్తవానికి మేడారం అడవుల్లోకి జాతరకు ఒకప్పుడు ఎడ్ల బండ్లపైనే వచ్చేవారు. కానీ పదిహేనేళ్లుగా వాహనాల రద్దీ పెరిగింది. తద్వారా పెరిగిన గాలి కాలుష్యం వాతావరణ సమతుల్యతను దెబ్బతీయటంతో పాటు కార్బన్ డయాక్సైడ్, మీథేన్ లాంటి విషవాయువులు సరస్సులు, చెరువులు, సముద్రాలు, గోదావరి నీటి తేమని పైకి వెళ్లకుండా కట్టడి చేస్తుందని, ఫలితంగా గాలిలో పయనించి తేమ పొరలా ఏర్పడి వర్షం రూపంలో ఒకేచోట (క్లౌడ్‌బరస్ట్) కుంభవృష్టిగా పడుతోందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. దీనినే గ్రీన్‌హౌస్ ఎఫెక్ట్‌గా కేయూ ప్రొఫెసర్ ఒకరు అభివర్ణించారు. ఈ కారణంతోనే ములుగు జిల్లా లక్ష్మీదేవిపేటలో గతేడాది జూలై 27వ తేదీన 64.98సె.మీ వర్షం కురిసి ఉండవచ్చుననే అభిప్రాయాలను పరిశోధకులు వెల్లడిస్తున్నారు. ఏటూరునాగారం, వాజేడు, వెంకటాపురం మండలాల్లో మేఘాలు ఇళ్లపైకి రావడానికి, చిలుకలగుట్ట పైన ఏర్పడిన సుడిగాలికి కూడా ఇదే కారణమై ఉండొచ్చనే చర్చ జరుగుతోంది. దీనికి తోడు ఈ ఏడాది ఆగస్టు 31న బంగాళాఖాతంతో పాటు అరేబియా సముద్రంలో ఏర్పడిన వాయుగుండం పెనుగాలులు సుడులుగా మారి మేడారం అడవుల్లో విధ్వంసం సృష్టించి ఉండవచ్చుననే అభిప్రాయాలు కూడా వ్యక్తమవుతున్నాయి. భారీగా వృక్షసంపద నష్టానికి ప్రధాన కారణం చెట్ల ఎదుగుదల కూడా ఒకటిగా చెబుతున్నారు. మేడారం అడవుల్లో నేల గట్టిగా ఉండటంతో చెట్ల వేర్లు లోపలికి వెళ్లకుండా.. పక్కకు పాకి ఉంటాయని, సక్రమంగా భూమితో పట్టు లేకపోవడంతో పెనుగాలులకు త్వరగా నేలకూలే అవకాశం కూడా ఉందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. అయితే ఈఏడాది ఆగస్టు 31న ఏర్పడిన విధ్వంసం టోర్నడోల వల్ల కాదని కొందరు వాదిస్తుంటే.. మరికొంత మంది శాస్త్రవేత్తలు మాత్రం పెనుగాలులే కారణంగా చెప్తున్నారు. దీనిపై శాస్త్రవేత్తలు లోతుగా పరిశోధనలు చేస్తుండటంతో ఓరుగల్లు ఏజెన్సీలోనే ప్రకృతి ప్రకోపానికి కారణం తెలుస్తుందనే చర్చ జరుగుతోంది.

వైపరిత్యాలను జంతువులెలా గుర్తించాయో..?

మేడారం అడవల్లో ఆగస్టు 31న భారీ పెనుగాలుల విధ్వంసానికి భారీ వృక్షాలు నేలకూలినప్పటికి అడవి జంతువులేవీ మృత్యువాత పడకపోవడం అధికారులను సైతం ఆశ్చర్యానికి గురి చేస్తోంది. 80వేలకు పైగా చెట్లు నేలకొరిగ్గా.. ఎక్కడా కూడా చిన్నపాటి జంతువు మృతి చెందిన ఆనవాళ్లు కనిపించలేదు. దీనికి కారణం జంతువులు, పక్షులు ప్రకృతి వైపరీత్యాల రాకను ముందే పసిగడతాయని అర్థమవుతోంది.

2023 జూలై 27న కుంభవృష్టి వాన లకు మోరంచ, కొండాయి వాగుల్లో భారీగా వరద వచ్చి ఇళ్లను ముంచెత్తినప్పటికి మానవులు ముందుగా నష్టాన్ని అంచనా వేయలేక పోయారు. ఆ సమయంలో తాడుతో కట్టేయకుండా వదిలేసి ఉన్న పశువులు ముందే వరద విధ్వంసాన్ని పసికట్టి సురక్షిత ప్రాంతాలకు వెళ్లిపోయాయి. కట్టేసి ఉన్న పశువులు అరుస్తూ తమ యజమానులను అప్రమత్తం చేయడం గురించి ఇప్పటికీ చర్చించుకుంటారు.

గ్లోబల్ వార్మింగ్ వల్లే వైపరిత్యాలు

ప్రొఫెసర్ ఎస్.జ్యోతి, కెమిస్ట్రీ, ప్రిన్సిపాల్ ఆర్ట్స్అండ్‌సైన్స్ కాలేజి హనుమకొండ



పట్టణీకరణ, పారిశ్రామీకరణ పెరగటంతో వాతావరణ కాలుష్యం పెరగడం, గ్లోబల్ వార్మింగ్ వల్లే ప్రకృతి వైపరీత్యాలు ఏర్పడుతున్నాయి. గతంలో మేడారం అడవుల్లోకి ఎడ్లబండ్లపై వెళ్లేవారు. ప్రస్తుతం వాహన కాలుష్యం పెరిగింది. దీనికి తోడు వాతావరణంలో విషవాయువులు పెరిగి, సముద్రాల నుంచి తేమ పైకి వెళ్లకుండా అడ్డు పడుతున్నాయి. దీంతో ఆసాధారణ వర్షాలు పడుతున్నాయి. ములుగు ఏజెన్సీలో కొద్దిగా చెట్లు ఎక్కువగా ఉండటంతో గాలి ద్వారా ఈ ప్రాంతంలో కుంభవృష్టి వానలు కురుస్తున్నాయి. వైపరీత్యాలను గుర్తించే శక్తి జంతువులకు ఉన్న కారణంగానే మేడారం అడవుల్లో వేల చెట్లు నేలకూలినా జంతువులకు ఎలాంటి ప్రాణ జరగలేదు.

వాతావరణ అసమతుల్యం వల్లే..

ప్రొఫెసర్ ఎన్.రామస్వామి, బయోటెక్నాలజీ, కాకతీయ విశ్వవిద్యాలయం



వాతావరణంలో అసమతుల్యమే ప్రకృతి వైపరీత్యాలకు ప్రధాన కారణం. మన ప్రాంతంలో ఉండాల్సినంత వృక్ష సంపద లేకపోవడం, వాతావరణ కాలుష్యం పెరగటం కూడా ఓ కారణం కావొచ్చు. అయితే మేడారం అడవుల్లో టోర్నడోల వల్ల చెట్లు నేలకూలి పోకపోవచ్చు. దీనిపై లోతుగా పరిశోధనలు జరుగుతున్నాయి. సాధారణంగా గాలిలో అధిక పీడనంవల్ల ఇలాంటి వైపరీత్యాలు ఏర్పడుతుంటాయి. ఇలాంటి సంఘటనలో తొలిసారిగా చూశా. అయితే సింగపూర్‌లో ఉన్న కొత్త టెక్నాలజీతో నేలకూలిన చెట్లను తిరిగి బతికించే అవకాశం ఉంది. ప్రభుత్వం ఈ దిశగా ప్రయత్నాలు చేయాలి.

క్రికెట్ క్రీడాభివృద్ధికి ప్రణాళికలు

- కుడా చైర్మన్ ఇనుగాల వెంకట్రామిరెడ్డి
- సందడిగా అంతర్ జిల్లాల క్రికెట్ టోర్నమెంట్స్ ప్రారంభం


క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న కుడా చైర్మన్ ఇనుగాల

వరంగల్ స్పోర్ట్స్, సెప్టెంబరు 28: కాకతీయ పట్టణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో గ్రామీణ ప్రాంతాల్లోని ప్రతిభ కలిగిన క్రికెటర్లను వెలికితీయడంతోపాటు జిల్లాలో క్రికెట్ క్రీడాభివృద్ధికి త్వరలోనే ప్రణాళికలు రూపొందిస్తామని కుడా చైర్మన్ ఇనుగాల వెంకట్రామిరెడ్డి స్పష్టంచేశారు. హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం మొగిలిచర్ల క్రికెట్ మైదానంలో ఏర్పాటు చేసిన అంతర్ జిల్లాల అండర్-19 బాలుర క్రికెట్ పోటీలను కుడా చైర్మన్ వెంకట్రామిరెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రానున్న రోజుల్లో గ్రామీణ ప్రాంతాల్లోని క్రికెట్ క్రీడాకారులను తీర్చిదిద్దేలా జిల్లాలో క్రికెట్ క్రీడను అభివృద్ధి చేస్తామన్నారు. వరంగల్ జిల్లా క్రికెట్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి చాగంటి శ్రీనివాస్ మాట్లాడుతూ.. హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మొగిలిచర్ల క్రికెట్ క్రీడా మైదానంతో పాటు కోమటిపల్లిలోని ఫోర్ట్ క్లబ్ క్రికెట్ మైదానంలో అంతర్ జిల్లా స్థాయిలో 8జట్లు పాల్గొంటాయని, వీటికి అక్టోబర్ 5వరకు క్రికెట్ పోటీలను నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో వరంగల్ జిల్లా క్రికెట్ అసోసియేషన్ సంయుక్త కార్యదర్శి బస్వరాజు ఉపేందర్, ఉపాధ్యక్షుడు ఖాజా, మాజీ కార్యదర్శి ఉదయభానురావు, సభ్యులు తోట రాము, మట్టెడ కుమార్, బండారి ప్రభాకర్, రామకృష్ణ, అభినవ్ వినయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు. కాగా, తొలిరోజు వరంగల్ - మహబూబ్‌నగర్ జట్ల మధ్య నిర్వహించిన పోటీలో ఆతిథ్య వరంగల్ జిల్లా ఓటమి చెందింది. మెదక్-నల్లగొండ జట్ల మధ్య జరిగిన పోటీల్లో నల్లగొండ జట్టు విజయం సాధించింది.

గురుకులాల్లో చాక్‌డౌన్-పెన్‌డౌన్

హనుమకొండ, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): వరంగల్ యాకుత్‌పుర గిరిజన గురుకుల పాఠశాలలో ఉపాధ్యాయులు గురుకుల విద్య జేఏసీ పిలుపు మేరకు శనివారం టీటీఆర్ఈఐటీఏ ఆధ్వర్యంలో చాక్‌డౌన్-పెన్‌డౌన్ కార్యక్రమం చేపట్టారు. ఉపాధ్యాయులు విధులకు హాజరై బోధన, కార్యాలయ పనులను బహిష్కరించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు మాట్లాడుతూ.. దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న తమ డిమాండ్లను పరిష్కరించాలని కోరారు. అనంతరం న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ పాఠశాల ప్రిన్సిపాల్ ద్వారా గురుకుల సెక్రెటరీకి మెమోరాండం సమర్పించారు. తెలంగాణ గిరిజన గురుకుల విద్యాలయాల ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పి.రుషీకేశ్‌కుమార్, ఆర్గనైజింగ్ సెక్రెటరీ సీహెచ్. సతీష్‌కుమార్, స్థానిక యూనిట్ అధ్యక్షుడు ఇ.రాజన్న, సీనియర్ ప్రిన్సిపాల్ బి.మధు, జూనియర్ వైస్‌ప్రిన్సిపాల్ భవానీ పాల్గొన్నారు.

మార్కెట్ చైర్మన్‌ను కలిసిన వ్యాపారులు



మార్కెట్ చైర్మన్ సంజీవరెడ్డికి మిఠాయి తినిపిస్తున్న ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు ప్రభుకిరణ్

కేసముద్రం, సెప్టెంబరు28 : కేసముద్రం వ్యవసాయ మార్కెట్ చైర్మన్‌గా ఇటీవలె నియామకమైన గంట సంజీవరెడ్డిని కల్వలలో శనివారం ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు వోలం ప్రభుకిరణ్ ఆధ్వర్యంలో వ్యాపారులు కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు మిఠాయిలు తినిపించి శుభాకాంక్షలు తెలిపారు. మార్కెట్ నిర్వహణలో నూతన పాలకమండలి తమకు సహకరించాలని ప్రభుకిరణ్ చైర్మన్‌ను కోరారు. ఛాంబర్ ఉపాధ్యక్షుడు శ్రీరాం కిరణ్, గార్లపాటి ప్రదీప్, కొడకండ్ల సంపత్‌రెడ్డి, కొత్తకొండ ఆకాశ్, మచ్చిక అశోక్, కాంగ్రెస్ గ్రామపార్టీ అధ్యక్షుడు గండి శ్రీనివాస్ పాల్గొన్నారు.

పీడీఎస్ బియ్యం విక్రయిస్తున్న వ్యక్తిని పట్టుకున్న వావిలాల గ్రామస్థులు

నెల్లికుదురు, సెప్టెంబర్ 28 : మండలంలోని వావిలాలలో జేఎస్‌ఆర్ బియ్యం పేరుతో పీడీఎస్ బియాన్ని విక్రయిస్తున్న వ్యక్తిని శనివారం గ్రామస్థులు పట్టుకున్నారు. గ్రామస్థులు బాలగాని రంజిత్, మోహన్, రాజుకుమార్, బొల్లెపెల్లి శ్రీధర్, విజయ్, కార్తీక్ తెలిపిన వివరాల ప్రకారం. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం జగ్గయ్యపేటకు చెందిన ఓ వ్యక్తి జేఎస్‌ఆర్ బియ్యం పేరుతో 2కింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని ద్విచక్రవాహనంపై గ్రామంలో తిరుగుతూ విక్రయిస్తున్నాడు. గ్రామస్థులకు అనుమానంరావడంతో పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే పోలీస్ వావిలాల గ్రామానికి చేరుకుని పీడీఎస్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు.

స్థానిక సంస్థల ఎన్నికల నాటికి పార్టీ బలోపేతం కావాలి

• డీసీసీ ఉపాధ్యక్షుడు అంబటి మహేందర్‌రెడ్డి



అమినాపురంలో మాట్లాడుతున్న డీసీసీ ఉపాధ్యక్షుడు అంబటి మహేందర్‌రెడ్డి

కేసముద్రం, సెప్టెంబరు 28: రాబోయే స్థానిక సంస్థల్లో గెలుపే లక్ష్యంగా పార్టీ సంస్థాగతంగా బలోపేతం కావాలని కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు అంబటి మహేందర్‌రెడ్డి అన్నారు. అమినాపురంలో గ్రామ పార్టీ కార్యాలయాన్ని శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థానిక సంస్థల నాటికి పార్టీని బలోపేతం చేయాలనే ఉద్దేశంతో కార్యకర్తలను సమాయత్తం చేసేందుకు కార్యాలయాన్ని ప్రారంభించినట్లు తెలిపారు. గ్రామపార్టీ అధ్యక్షుడు సామ సుధాకర్‌రెడ్డి, ముదిగిరి సాంబయ్య, మండల ఉపాధ్యక్షుడు కల్లెం శ్రీనివాస్‌రెడ్డి, లింగాల నేతాజీ, జన్ను కట్టయ్య, ఇనుముల కరుణాకర్, ఆరిద్రపు కుమారస్వామి, పోతుల రవి, మందుల కృష్ణమూర్తి, బాలునాయక్, మంజుల, రమాదేవి పాల్గొన్నారు.

మాజీ ఎంపీని సత్కరించిన ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి

మహబూబాబాద్ టౌన్, సెప్టెంబరు 28 : జిల్లా కేంద్రంలో మాజీ ఎంపీ బోయినపల్లివినోద్‌కుమార్‌ను ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్‌రావు శాలువాలతో సత్కరించారు. వినోద్‌కుమార్ హైదరాబాద్ నుంచి మరిపెడకు వెళ్తున్న క్రమంలో మహబూబాబాద్‌లో తక్కెళ్లపల్లి నివాసంలో శనివారం కాసేపు ఆగారు. ఈ సందర్భంగా వినోద్‌కుమార్‌ను సాదరంగా స్వాగతించి, పుష్పగుచ్ఛం అందించిశాలువాలతో సత్కరించారు. మునిసిపల్ వైస్‌చైర్మన్ మార్నేని వెంకన్న, వార్డు కౌన్సిలర్ ఎడ్ల వేణుమాధవ్, బీఆర్‌ఎస్ నాయకులు మంగలంపల్లి కన్న, జెరిపోతుల వెంకన్న, మార్నేని రఘు, కిరణ్‌కుమార్, మడత వెంకన్న పాల్గొన్నారు.

జమిలి ఎన్నికలతో సమైక్య స్ఫూర్తి ధ్వంసం

మహబూబాబాద్ రూరల్, సెప్టెంబరు28 : కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ క్యాబినెట్ ఆమోదించిన జమిలి ఎన్నికల విధానంతో దేశ సమైక్య స్ఫూర్తిని ధ్వంసం చేస్తుందని సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ ప్రజాపంథా జిల్లా కార్యదర్శి పాయం చిన్న చంద్రన్న అన్నారు. మహబూబాబాద్‌లో శనివారం నిర్వహించిన ఆ పార్టీ ముఖ్యకార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రప్రభుత్వం అనాలోచిత విధానంతో తీవ్ర విఘాతం కల్పిస్తుందని చెప్పారు. భారతదేశంలో భిన్న రాష్ట్రాలు, భిన్న రాజకీయ, భౌగోళిక, భౌతిక, ఆర్థిక, సామాజిక తేడాలను గుర్తించిన రాజ్యాంగం వాటిని కాపాడుకుంటూనే అభివృద్ధి వైపు పయనించాలని అనేక నియమాలను రూపొందించినట్లు చెప్పారు. హైడ్రా పేరుతో ధనికవర్గాల ఇండ్లను కూల్చుతున్న సీఎం రేవంత్‌రెడ్డి పేదల ఇండ్ల జోలికి వస్తే సహించబోమన్నారు. సమావేశంలో కొత్తపల్లి రవి, వీరన్న, సూర్యం, వెంకటేశ్వర్లు, పాపారావు, యాకయ్య, మోష పాల్గొన్నారు.

రోగులకు మెరుగైన వైద్యసేవలందించాలి

కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్



సీహెచ్‌సీలో వైద్య సిబ్బందితో మాట్లాడుతున్న అద్వైత్‌కుమార్‌సింగ్

గార్ల,సెప్టెంబరు 28 : ప్రభుత్వ ఆస్పత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలందించాలని కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్ వైద్యాధికారులను ఆదేశించారు. గార్ల మండలంలో శనివారం పర్యటించి, పలు ప్రభుత్వ కార్యాలయాలతో పాటు సీహెచ్‌సీని తనిఖీ చేశారు. తొలుత స్థానిక సీహెచ్‌సీ ఆస్పత్రికి చేరుకుని ఆస్పత్రి పరిసరాలను పరిశీలించారు. వార్డుల్లో చికిత్స పొందుతున్న రోగుల వద్దకు వెళ్లి వైద్యం ఎలా అందుతుందని అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ ఆస్పత్రి పరిధిలో సీజనల్ వ్యాధుల పట్ల తగు చర్యలు తీసుకుని గ్రామాల్లో వైద్యశిబిరాలు ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అనంతరం స్థానిక బాలుర వసతి గృహానికి చేరుకుని పరిసరాలను పరిశీలించారు. అక్కడ్నుంచి యూపీఎస్ పాఠశాలను సందర్శించి విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలపై ఆరా తీశారు. విద్యార్థులతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం వారిని ప్రశ్నలు వేసి సమాధానాలు రాబట్టి, సంతృప్తి వ్యక్తం చేశారు. తర్వాత అంగన్‌వాడీ సెంటర్‌ను సందర్శించి రిజిస్టర్లను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ జర్పుల సుధాకర్, కార్యదర్శి కిషన్ పాల్గొన్నారు.

విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణించాలి..

గ్రామీణప్రాంతాల్లో చదువుకునే విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్ అన్నారు. స్థానిక జిల్లాపరిషత్‌పాఠశాలలో నిర్వహిస్తున్న ఎస్‌జీఎఫ్ క్రీడలను కలెక్టర్ ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంఈవో మంకిని వీరభద్రం, మాలోతు శివనాయక్, డిప్యూటీ తహసీల్దార్ జర్పుల సుధాకర్ పాల్గొన్నారు.

అశాస్త్రీయమైన నిబంధనలను మార్చాలి

• ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు సుధాకరాచారి

తొర్రూరు రూరల్, సెప్టెంబరు 28 : అశాస్త్రీయమైన ఉపాధ్యాయుల హేతుబద్ధీకరణ నిబంధనలను మార్చాలని ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు కొరవి సుధాకరాచారి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తొర్రూరు మండలం హరిపిరాల ఉన్నత పాఠశాలలో జీవో ఎంఎస్ నెంబరు 25కి వ్యతిరేకంగా నల్లబ్యాడ్జీలను ధరించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలలల్లో విద్యార్థుల సంఖ్య ఆధారంగా ఉపాధ్యాయులను నియమించడం సరికాదన్నారు. అశాస్త్రీయమైన రేషలైజేషన్ నిలిపివేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో పాఠశాల హెచ్‌ఎం బి.వెంకటేశ్వరావు, అనురాధ, రవి, మధుకర్, రాజేశ్వర్, కుమార్, సంపత్, మహేందర్, ఆంజనేయులు, రవి, దర్గయ్య పాల్గొన్నారు.

‘భగత్‌సింగ్ నేటి యువతరానికి స్ఫూర్తి ప్రదాత’

మహబూబాబాద్‌టౌన్, సెప్టెంబరు28 : బ్రిటీష్ వారి కబంధ హస్తాల నుంచి దేశాన్ని విముక్తి చేసేందుకు తన చిన్నతనంలోనే ఉరి కొయ్యను ముద్దాడిన విప్లవవీరుడు భగత్‌సింగ్ అని భగత్‌సింగ్ స్టడీ సర్కిల్ అధ్యక్షుడు కల్లెం వీరారెడ్డి అన్నారు. బ్రిటీష్ సామ్రాజ్యావాదానికి వ్యతిరేకంగా పోరాడి ప్రాణత్యాగం చేసిన భగత్‌సింగ్ నేటి యువతరానికి చైతన్య స్ఫూర్తి ప్రదాత అని చెప్పారు. మహబూబాబాద్‌లో భగత్‌సింగ్ స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో శనివారం భగత్‌సింగ్ జయంతిని నిర్వహించారు. స్థానిక రైల్వేస్టేషన్ సమీపంలోని భగత్‌సింగ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సోమ గోవర్థన్, కొమిరె ఉప్పలయ్య, తండా సదానందం, సోమ సైదులురెడ్డి, గొర్రె శ్రీనివాస్, కాపరబోయిన శ్రీనివాస్, అవునూరి రవి, కాలేరు రవిప్రసాద్, కె.సాయిలు పాల్గొన్నారు.

• తెలంగాణ గిరిజన సంఘం (టీజేఎస్) భారత విద్యార్థి సమాఖ్య (ఎస్ఎఫ్ఐ)ల ఆశ్వర్యంలో స్థానిక పెరుమాండ్ల జగన్నాథం భవన్‌లో పోరాటయోధుడు భగత్‌సింగ్ జయంతిని నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. శాంతికుమార్, సూర్యప్రకాశ్, సతీష్, ప్రవీణ్, వినయ్, సాన్విత్ పాల్గొన్నారు.

• కురవి మండలం బంచరాయి తండాలో పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో భగత్‌సింగ్ జయంతి నిర్వహించారు. రాష్ట్ర నాయకుడడు బానోత్ దేవేందర్, తదితరులు పాల్గొన్నారు.

• స్వాతంత్ర్య అమరవీరుడు భగత్‌సింగ్ జయంతి సందర్భంగా కేసముద్రం మండలంలోని కల్వల హైస్కూల్లో హెచ్‌ఎం బండారు నరేందర్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆర్.ఏకాంబ్రం, తండ సదానందం, రాగి భిక్షపతి, వేముల నాగేందర్, బి.బాలశౌరెడ్డి, వి.రాజేంద్రచారి, పీడీ కొప్పుల శంకర్ పాల్గొన్నారు.

సత్యశోధక్ సమాజ్ ఆవిర్భావ దినోత్సవం

కేసముద్రం, సెప్టెంబరు 28 : మహాత్మా జ్యోతిబాపూలే స్థాపించిన సత్యశోధక్ సమాజ్ 152వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా శనివారం కేసముద్రంలోని పూలే విగ్రహానికి సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ తొర్రూరు సబ్ డివిజన్ కమిటీ కార్యదర్శి శివారపు శ్రీధర్ ఆధ్వర్యంలో పూలమాలలు వేసి నివాళులర్పించారు. కొట్టం అంజయ్య, బట్టు నాగేశ్వర్‌రావు, బట్టమేకల రాజు, అంబటి నాగమల్లు, ఎస్‌కె.జిలాని, సకినాల ఐలయ్య ప్రవీణ్, యాదయ్య, సురేష్, రమేష్ పాల్గొన్నారు.

జాతీయస్థాయి క్రీడలకు స్పోర్ట్స్ స్కూల్ విద్యార్థి



శివగణేష్

కొత్తగూడ, సెప్టెంబరు 28 : జాతీయస్థాయి ట్రాయాటిక్ క్రీడలకు మండల కేంద్రంలోని స్పోర్ట్స్ స్కూల్ విద్యార్థి శివగణేష్ ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు సారయ్య తెలిపారు. ఈనెల 18, 19న హైదరాబాద్‌లో నిర్వ హించిన రాష్ట్రస్థాయి క్రీడల్లో ప్రతిభ కనబరచిన శివగణేష్ జాతీయస్థాయి క్రీడలకు ఎంపికయ్యారు. జాతీయస్థాయి క్రీడలకు ఎంపికైన శివగణేష్‌ను, కోచ్ ధనాజీని డీడీ సైదానాయక్, ఏటీడీఓ భాష్కర్, హెచ్‌ఎం సారయ్య, ఉపాధ్యాయులు అభినందించారు.

వాటర్‌ప్లాంట్ మరమ్మతుకు సాయం

• విద్యార్థుల దాహార్తిని తీర్చిన తండా సత్యనారాయణ



మినరల్ వాటర్‌ప్లాంట్‌కు మరమ్మతులు చేయించి ప్రారంభిస్తున్న సత్యనారాయణ

మహబూబాబాద్ టౌన్, సెప్టెంబరు 28 : మహబూబాబాద్ ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో మినరల్ వాటర్‌ప్లాంట్ మరమ్మతుల కోసం పట్టణానికి చెందిన రిటైర్డ్ ఆర్మీ ఆఫీసర్ తండా సత్యనారాయణ శనివారం ఆర్థిక సహాయం అందించి, విద్యార్థుల దాహార్తిని తీర్చారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో మినరల్ వాటర్‌ప్లాంట్ పాడైపోవడంతో విద్యార్థులు తాగునీటికి ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయం తెలుసుకున్న తండా సత్యనారాయణ రూ.12,500 ఆర్థిక సహాయం అందించి, మినరల్ వాటర్‌ప్లాంట్‌కు మరమ్మతులు చేయించారు. మినరల్ వాటర్ మరమ్మతులకు సాయం అందించిన సత్యనారాయణకు కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపక బృందం ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపింది.

‘యూరియా బ్లాక్‌చేస్తే లైసెన్స్ రద్దు’

మరిపెడ, సెప్టెంబరు 28 : యూరియాను బ్లాక్‌చేసి, అధిక ధరలకు విక్రయిస్తే ఫెర్టిలైజర్స్ దుకాణాల లైసెన్స్‌లు రద్దు చేస్తామని మరిపెడ ఏవో వీరాసింగ్ డీలర్లను హెచ్చరించారు. శనివారం ఆయన సొసైటీ గోడౌన్స్, రైతు ఆగ్రోస్ గోడౌన్స్, పలు ఫెర్టిలైజర్ షాపులలోని యూరియా నిల్వలను ఆకస్మికంగా తనిఖీచేశారు. యూరియా కొరత ఉందని వచ్చే పుకార్లను రైతులు నమ్మొద్దని సూచించారు. సరిపడా స్టాక్ ఉందన్నారు.

ఆర్థిక స్వావలంబనకు ‘మహిళా శక్తి క్యాంటీన్లు’

(5వ పేజీ తరువాయి)

మహిళా సమాఖ్య ద్వారా రుణాలు మంజూరు చేస్తున్నారు. బ్యాంకు నుంచి ఎలాంటి పూచీకత్తు లేకుండా మహిళా శక్తి క్యాంటీన్ ఏర్పాటు కోసం రుణం ఇస్తున్నారు. అలాగే ప్రభుత్వ కార్యాలయాలు ఉన్నచోట అద్దె లేకుండా క్యాంటీన్ ఏర్పాటుకు గదులను ఇప్పిస్తున్నారు. క్యాంటీన్ ఏర్పాటు కోసం రూ.2లక్షల నుంచి రూ.10 లక్షల వరకు ప్రాంతాన్ని బట్టి సంఘాలకు రుణాన్ని ఇస్తున్నారు. బడ్జెట్ ఎక్కువగా ఉన్నచోట రెండు, మూడు సంఘాలకు కలిపి రుణాన్ని మంజూరు చేస్తున్నారు. ఆయా స్వయం సహాయక సంఘాల్లో ఆసక్తి ఉన్న మహిళలు ఈ క్యాంటీన్లను నిర్వహిస్తూ తమ రుణాన్ని వాయిదాల రూపంలో తిరిగి చెల్లించాల్సిఉంటుంది. ఈ పథకాన్ని ప్రతిష్ఠాత్మకంగా తీసుకోవడంతో మహిళా శక్తి క్యాంటీన్ నిర్వహణ ఏర్పాట్లపై క్షేత్రస్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షణ, సమీక్షలు నిర్వహిస్తున్నారు.

జిల్లాలో మొదటి దశలో కొన్ని..

మహబూబాబాద్ జిల్లాలో మహిళా శక్తి క్యాంటీన్ల ఏర్పాటులో మొదటి దశలో ఐదు సిద్ధం అవుతుండగా మరో ఐదుమండలాల్లో క్యాంటీన్లను ఏర్పాటు చేస్తున్నట్లు సమాచారం. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో వ్యవసాయ మార్కెట్ ఆవరణ, కోర్టు, జిల్లా కలెక్టరేట్, అనంతారం ప్రాంతాలతో పాటు కేసముద్రం, డోర్నకల్, కొత్తగూడ, గూడూరు, తొర్రూరు, మరిపెడ మండల కేంద్రాల్లో ఒకటి చొప్పున మహిళా శక్తి క్యాంటీన్ల ఏర్పాటుకు ప్రతిపాదనలు చేశారు. ఇప్పటికే మహబూబాబాద్ పట్టణంలోని మూడు ప్రాంతాలు, కేసముద్రం వ్యవసాయ మార్కెట్ ఆవరణలో మహిళా శక్తి క్యాంటీన్లను ఏర్పాటు చేయడం పూర్తయి ప్రారంభానికి సిద్ధమవుతున్నాయి. మంత్రులు, రాష్ట్రస్థాయి ప్రజాప్రతినిధులతో మహిళాశక్తి క్యాంటీన్లను అట్టహాసంగా ప్రారంభించేందుకు అధికారులు సన్నాహాలు చేస్తు న్నట్లు సమాచారం. ఏదేమైనా తమకు అధిక ప్రాధాన్యతనిస్తూ ప్రత్యేకంగా మహిళా శక్తి క్యాంటీన్లను ఏర్పాటు చేయడంపట్ల మహిళలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



హెచ్‌ఎం కృష్ణయ్యకు నగదును అందిస్తున్న మాజీ సర్పంచ్ కొమ్మినేని రవీందర్

దాట్ల ఉన్నత పాఠశాలకు ఆర్థిక సాయం

దంతాలపల్లి, సెప్టెంబరు 28 : మండలంలోని దాట్ల ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు శనివారం దివంగత మాజీ ఎంపీపీ వృషసేనారెడ్డి జ్ఞాపకార్థకంగా మేరెడ్డి రజితరెడ్డి, కేశవరెడ్డి దంపతులు అందజేసిన రూ.1.75లక్షలను తాజా మాజీ సర్పంచ్ కొమ్మినేని రవీందర్ ప్రధానోపాధ్యాయుడు కృష్ణయ్యకు అందించారు. ఈ సందర్భంగా కొమ్మినేని రవీందర్ మాట్లాడుతూ పుట్టి పెరిగిన గ్రామంలోని పాఠశాలకు సమాజసేవలో భాగంగా ఆర్థిక సాయం చేయడం హర్షణీయమన్నారు. గతంలో వృషసేనారెడ్డి జ్ఞాపకార్థం గా ఎన్నో కార్యక్రమాలను చేయడం సంతోషకరమన్నారు. పంచాయతీ కార్యదర్శి లక్ష్మి, గ్రామస్థులు బాస్కర్, మాజీ ఉప సర్పంచ్ యాకన్న, నాయకులు సురేష్, మాజీ ఉపసర్పంచ్ రాము పాల్గొన్నారు.

రాజకీయ కక్ష్యలతోనే ఈడీ దాడులు

గార్ల, సెప్టెంబరు 28 : రాజకీయ కక్ష్యలతోనే రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని అప్రతిష్టపాలు చేయాలని బీజేపీ ప్రభుత్వం చూస్తుందని కాంగ్రెస్ మండల పార్టీ కార్యనిర్వహణ అధ్యక్షుడు తాళ్లపల్లి కృష్ణగౌడ్ ఆరోపించారు. గార్లలో శనివారం ఏర్పాటుల చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశంలో బీజేపీ వ్యతిరేక శక్తులను అణిచివేయాలన్న కుట్రపూరితంగా ప్రధాని నరేంద్రమోదీ ప్రభుత్వం ఈడీ, ఐటీ దాడులు చేపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ మాజీ సభ్యుడు రావూరి వెంకట్రామయ్య, మాజీ ఎంపీపీ మాలోతు వెంకట్‌లాల్, గుండా వెంకట్‌రెడ్డి, పృథ్వీనాయక్, హత్తిరాంనాయక్ పాల్గొన్నారు.

విద్యార్థి దశలో కష్టపడితే భవిష్యత్ బంగారుమయం

ఎస్‌డీఎల్‌సీ డైరెక్టర్ రాంచంద్రం



నలంద డిగ్రీ కళాశాల ఫ్రెషర్స్‌డేలో మాట్లాడుతున్న రాంచంద్రం

మహబూబాబాద్‌టౌన్, సెప్టెంబరు 28 : విద్యార్థి దశలో లక్ష్యాన్ని ఎంచుకుని కష్టపడి చదివితే భవిష్యత్ బంగారు మయంగా మారుతుందని కాకతీయ యూనివర్సిటీ డీన్, ఎస్‌డీఎల్‌సీ డైరెక్టర్ ప్రొఫెసర్ రాంచంద్రం అన్నారు. మహబూబాబాద్ ఆర్తిగార్డెన్స్‌లో నలంద డిగ్రీ కళాశాల ఫ్రెషర్స్ డేను శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ ఏరంగాన్ని ఎంచుకున్నా దానిలో క్రమశిక్షణ, పట్టుదలతో ముందుకు సాగితే అనుకున్న లక్ష్యాలను చేరుకోవచ్చన్నారు. నేటి యువత సెల్ ఫోన్‌ల బారినపడి చెడు మార్గంలో పయనిస్తు న్నారని, మొబైల్‌కు బానిసైతే భవిష్యత్ అంధ కారంగా మారుతుందని చెప్పారు.

విద్యతోనే సంస్కారం : ప్రొఫెసర్ దినేష్‌కుమార్

విద్య సంస్కారాన్ని నేర్పడంతో పాటు సంపూర్ణ విజ్ఞానాన్ని అందిస్తుందని కేయూ ప్రొఫెసర్, ఎస్‌డీఎల్‌సీ మాజీ డైరెక్టర్ దినేష్‌కుమార్ అన్నారు. సమసమాజాన్ని మార్చేశక్తి ఒక్క విద్యకు మాత్రమే ఉంటుందని తెలిపారు. అనంతరం డిగ్రీ ద్వితీయ, తృతీయ సంవత్సరంలో అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు మెమెంటోలు అందజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల చైర్మన్ నూకల శ్రీరంగారెడ్డి, కరస్పాండెంట్ డోలి సత్యనారాయణ, డైరెక్టర్ డోలి సాధన, ప్రిన్సిపాల్ వై.కృష్ణ ప్రసాద్, గట్టు శ్రీపాల్‌రెడ్డి, ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ పి.సదానందం, మునిసిపల్ ఫ్లోర్‌లీడర్ చిట్యాల జనార్దన్, పమ్మి రాజు, పట్టాభి లక్ష్మయ్య, కేబీ శంకర్, కృష్ణారావు, ప్రసాద్, శేఖర్,ఉప్పలయ్య, నరేష్, ముత్తయ్య, రాజు, భాస్కర్, రవి, రవిశంకర్ పాల్గొన్నారు.

కార్యకర్తలను కాపాడుకుంటా

మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

పెద్దవంగర, సెప్టెంబరు 28 : నియోజకవర్గ ప్రజలను, కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటామని మాజీమంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. మండలంలోని ఉప్పరగూడెంకు చెందిన బీఆర్‌ఎస్ గ్రామ పార్టీ అధ్యక్షుడు సీలం సోమయ్య (61) అనారోగ్యంతో మరణించడంతో శనివారం మృతుడి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. మాజీ పాలకుర్తి దేవస్థాన చైర్మన్ వి.రామచంద్రయ్యశర్మ, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు ఈదరు ఐలయ్య, శ్రీరాంసుధీర్, శ్రీరాం సంజయ్, వెంట్రామయ్య, సమ్మయ్య, శ్రీరాంరాము, శ్రీనివాస్, అశోక్, షర్ఫోద్దీన్, పటేల్, భాస్కర్, హరీష్, వేణు, రవి, సతీష్, అనుదీప్ పాల్గొన్నారు.



మృతుడి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎర్రబెల్లి

ప్రపంచ వ్యాప్తంగా రోటరీ సామాజిక సేవలు

• ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ డిప్యూటీ గవర్నర్ సాంబశివరావు

మహబూబాబాద్ టౌన్, సెప్టెంబరు 28 : ప్రపంచ వ్యాప్తంగా రోటరీక్లబ్ వందేళ్లుగా సామాజిక సేవలు అందిస్తుందని రోటరీ క్లబ్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ -3150 డిప్యూటీ గవర్నర్ దొడ్డపనేని సాంబశివరావు అన్నారు. మహబూబాబాద్ బృందావన్ గ్రాండ్ హోటల్‌లో శనివారం రోటరీక్లబ్‌ఆఫ్ మహబూబాబాద్ 2024-25 నూతన కమిటీ ప్రమాణస్వీకారోత్సవాన్ని నిర్వహించారు. అధ్యక్షుడు గూడూరు నాగేశ్వర్‌రావు, ప్రధాన కార్యదర్శి వేంశెట్టి కిషోర్‌కుమార్, కోశాధికారి జంగాల విజయ్ కుమార్, నూతన సభ్యులు వనమాల సురేష్, శంతన్ రామా రాజులచే ఇన్‌స్టాలేషన్ ఆఫీసర్, రోటరీ క్లబ్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ -3150 డిప్యూటీ గవర్నర్ సాంబ శివరావు ప్రమాణ స్వీకారోత్సవం చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచ దేశాల్లో విద్య, వైద్యం, పర్యావరణం, శాంతి, మహిళా శిశు సంక్షేమం, పారిశుధ్యం, తాగునీటి విషయంలో రోటరీక్లబ్ సేవలందిస్తుందని చెప్పారు. అనంతరం ప్రధాన కార్యదర్శి వేంశెట్టి కిషోర్‌కుమార్ రూ.10 వేల విలువైన వీల్‌చైర్‌ను సికింద్రాబాద్‌తండా వాసి భూక్య రమేష్‌కు ఉచి తంగా అందించారు. ఈ కార్యక్రమంలో పూర్వ అధ్యక్షుడు కొడారి నాగేశ్వర్‌రావు, వద్దుల సురేందర్‌రెడ్డి, డాక్టర్ డోలి సత్యనారాయణ, తోర్నాల నాగేష్‌కుమార్, బిక్కి వెంకటేశ్వర్లు, పి.సదానందం, శ్రీనివాస్, గిరిధర్‌గుప్తా, వెంకట్‌రెడ్డి, మహిపాల్‌రెడ్డి, వెంకన్న, మోహన్‌రెడ్డి, రమేష్, సతీష్‌రావు, సత్యం, లక్ష్మీనర్సింహారావు, జంగాల నర్సింహారావు పాల్గొన్నారు.



రోటరీ క్లబ్ నూతన కమిటీ బాధ్యులతో ప్రమాణ స్వీకారం చేయిస్తున్న సాంబశివరావు

ద్విచక్రవాహనం ఢీకొని వృద్ధురాలు మృతి



నర్సమ్మ (ఫైల్)

మహబూబాబాద్ రూరల్, సెప్టెంబరు 28 : ద్విచక్రవాహనం ఢీకొని ఓ వృద్ధురాలు మృతి చెందినఘటన మానుకోట పట్టణం ఆర్టీసీ సమీపంలో శనివారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం. బ్రాహ్మణపల్లి లక్ష్మీపురం గ్రామానికి చెందిన ముద్దంగుల నర్సమ్మ (65) కూలీ పనులు చేసుకుం టూ జీవనం కొనసాగిస్తోంది. పట్టణంలోని ఓప్రైవేట్ ఫైనాన్స్‌లో తీసుకున్న రుణాన్ని రెన్యూవల్ చేసుకునేందుకు మహబూబాబాద్‌కు వచ్చారు. ఆధార్‌కార్డు జిరాక్స్ తీసుకునేందుకు ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో రోడ్డు దాటుతున్న క్రమంలో నర్సమ్మను పట్టణంలోని ఓప్రైవేట్ పాఠశాల యాజమాని ద్విచక్రవాహనం ఢీకొట్టడంతో ఆమె తలకు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందింది. మృతురాలికి నలుగురు కుమార్తెలు, నలుగురు కుమారులు ఉన్నారు.

అప్పుల బాధతో ప్రభుత్వ ఉద్యోగి ఆత్మహత్య



బైరి సుధాకర్ (ఫైల్)

దంతాలపల్లి, సెప్టెంబరు 28 : అప్పుల బాధతో ఓ ఉద్యోగి ఆత్మహత్య చేసుకున్న ఘటన శనివారం మహబూబాబాద్ జిల్లా దంతాలపల్లి మండలం కుమ్మరికుంట్లలో జరిగింది. ఈ ఘటనకు సంబంధించి ఎస్సై రాజు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కుమ్మరికుంట్ల గ్రామానికి చెందిన బైరి సుధాకర్ (56) మరిపెడ మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఎల్‌డీసీగా విధులు నిర్వరిస్తున్నాడు. కొద్ది కాలం నుంచి అయనకు అప్పులు పెరగడంతో తీవ్ర మనస్తాపానికి గురయ్యాడు. అలాగే పిల్లల వివాహం కోసం తెచ్చిన అప్పులు, వాటికి వడ్డీలు పెరుగడంతో ఎలా తీర్చాలని మనోవేదన చెంది, శనివారం ఇంట్లో ఫ్యానుకు తాడుతో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడికి భార్య లలిత, కుమారుడు, కుమార్తె ఉన్నారు. కుమార్తె ప్రస్తుతం అమెరికాలో ఉన్నారు. పోలీసులు శవపంచనామా చేసి మృతదేహాన్ని పోస్టుమార్టానికి తొర్రూరు పట్టణానికి తరలించారు.

విద్యుదాఘాతంతో కాడి ఎద్దులు మృతి

మరిపెడ రూరల్, సెప్టెంబరు 28 : విద్యుదాఘాతంతో రెండు కాడి ఎద్దులు మృతి చెందిన సంఘటన మండలంలోని మూలమర్రి తండా జీపీలో శనివారం చోటు చేసుకుంది. మూలమర్రి తండాకు చెందిన భూక్యా బిచ్యాకు చెందిన కాడి ఎద్దులు తన పొలంలో మేతమేస్తున్న క్రమంలో అతితక్కువ ఎత్తులో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌కు తగలి కాడి ఎద్దులు అక్కడికక్కడే మృతి చెందాయి. దీంతో సుమారు లక్ష రూపాయలు నష్టపోయానని లబోదిబోమంటున్నాడు. గిరిజన రైతును ప్రభుత్వం ఆదుకోవాలని తండా వాసులు కోరుతున్నారు.

షూటింగ్ బాల్‌పోటీలకు నెల్లికుదురు విద్యార్థులు

నెల్లికుదురు, సెప్టెంబరు 28 : మండలకేంద్రంలోని ప్రభుత్వం జూనియర్ కళాశాలలో శనివారం జిల్లాస్థాయి అండర్-19 షూటింగ్ బాల్‌పోటీలు నిర్వహించారు. బాలికల విభాగంలో స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థినిలు ఎం కల్పన, జి.అక్షిత, బాలుర విభాగంలో ఎండీ ఆసీఫ్, బి.సాగర్, జి అన్వేష్ అత్యంత ప్రతిభ కనబరిచినట్లు క్రీడల ఇన్‌చార్జి సుధాకర్ తెలిపారు. ఎంపికైన విద్యార్థులు అక్టోబర్ 2 నుంచి 5 వరకు నారాయణకేడ్‌లో జరిగే రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొననున్నట్లు తెలిపారు. ఈ క్రీడాకారులను ప్రిన్సిపాల్, అధ్యాపకులు అభినందిచారు.

ఫుట్‌బాల్ క్రీడలకు బలపాల స్టూడెంట్స్..

రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీలకు ఎంపికైన విద్యార్థులను అభినందిస్తున్న హెచ్‌ఎం నర్సింహారెడ్డి



• కురవి : బలపాల జడ్పీహెచ్‌ఎస్ పాఠశాలకు చెందిన విద్యార్థులు రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీలకు ఎంపికయ్యారని హెచ్‌ఎం నర్సింహారెడ్డి తెలిపారు. ఈనెల 27న వరంగల్‌లో జరిగిన అండర్-17 ఫుట్‌బాల్ పోటీల్లో పాఠశాలకు చెందిన యు.హేమలత, బి.లెనిన్‌లు రాష్ట్రస్థాయిపోటీలకు ఎంపికయ్యారని పేర్కొన్నారు. పాఠశాలలో విద్యార్థులను అభినందించారు. ఉపాధ్యాయులు మధుసూదన్‌రెడ్డి, బీవీ ప్రసాద్, గోపికృష్ణ, సీతారాములు, జయశ్రీ, వెంకటప్పయ్య, మోతీలాల్, పీఈటీ శ్రీనివాస్, రాజేశ్వర్ పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు

కురవి, సెప్టెంబరు 28 : ఫర్టిలైజర్ షాపులు నిర్వహిస్తున్న యాజమానులు రైతులకు నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని మరిపెడ వ్యవసాయ సంచాలకుడు వి.వవిజయచంద్ర హెచ్చరించారు. కురవి మండలంలోని బలపాల, రాజోలు గ్రామాల్లో ఫర్టిలైజర్‌షాపులను శనివారం తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో కురవి ఏవో వి.నరసింహారావు పాల్గొన్నారు.

చర్చి కాంపౌండ్‌లో ఫారెస్టు అధికారుల తనిఖీలు

డోర్నకల్, సెప్టెంబరు 28 : మునిసిపల్ కేంద్రంలోని చర్చికాంపౌండ్‌లో అటవీశాఖ అధికారులు శనివారం తనిఖీలు నిర్వహించారు. కాంపౌండ్‌లో చెట్లను నరికి అక్రమంగా ఓ చోట నిల్వ చేశారన్న పక్కా సమాచారంతో మహబూబాబాద్ డీఎఫ్‌వో కృష్ణమాచారి ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహించారు. చర్చికాంపౌండ్‌లో నూతనగా నిర్మితమవుతున్న భవన నిర్మాణానికి టేకు కలపను ఉపయోగిస్తున్నారన్న సమాచారం మేరకు అక్కడ కూడా ఆ తనిఖీలు చేపట్టారు. భవనం నిర్మిస్తున్న వారు కలపకు సంబంధించిన కొనుగోలు బిల్లులను అటవీ అధికారులకు చూపించారు. దీంతో అటవీశాఖ అధికారులు వెనుదిరిగి వెళ్లారు.

పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

• మునిసిపల్ చైర్మన్ వాంకుడోతు వీరన్న

డోర్నకల్, సెప్టెంబరు 28 : ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని డోర్నకల్ మునిసిపల్ చైర్మన్ వాంకుడోతు వీరన్న అన్నారు. గత జనవరిలో ప్రజాపాలన సందర్భంగా గ్యాస్ వినియోగదారులకు రాష్ట్ర ప్రభుత్వం సబ్సిడీపై సిలిండర్‌కు 500 అందిస్తుందని తెలిపారు. ఈ పథకానికి ఎంపికైన 1865 మంది లబ్ధిదారులకు సబ్సిడీ మంజూరు పత్రాలను అందించారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ వైస్ చైర్మన్ కోటిలింగం, కమిషనర్ నరేష్‌రెడ్డి, కౌన్సిలర్లు బసిక అశోక్, జర్పుల వీరన్న, పోటు జనార్థన్, పర్వీన్ సుల్తాన, కాంగ్రెస్ నాయకులు మాద శ్రీనివాస్, నున్సావత్ భద్రునాయక్, ఎస్.వెంకటేశ్వర్లు, రెడ్డబోయిన శంకర్, ఎల్లావుల హరికృష్ణ పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి ఆర్థిక సహాయం

కొత్తగూడ, సెప్టెంబరు 28 : మండలంలోని గుంజేడులో ఇటీవల మృతి చెందిన బట్టు సాంబయ్య కుటుంబానికి మంత్రి సీతక్క ఆదేశాలతో నర్సంపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ బొల్లు రమేష్ 50 కిలోల బియ్యంను ఆర్థిక సహాయం రూపంలో శనివారం అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ భూక్య పుష్పలత నరేందర్, నాయకులు సిరబోయిన కళ్యాణ్, తోలెం అనంతరావు, పెదకాసు మల్లేష్ పాల్గొన్నారు. కాగా, బట్టు సాంబయ్య కుటుంబానికి ఆటో డ్రైవర్స్ యూనియన్ ఆధ్వర్యంలో 50 కిలోల బియ్యం అందజేశారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు అప్సర్, ఉపాధ్యాక్షుడు నక్క నరేష్, అజ్మీరా రాజన్న, ఇస్మాయిల్, రమేష్, గణేష్, సతీష్ పాల్గొన్నారు.

కార్మికుల ప్రయోజనాల కోసం కృషి చేయాలి

తొర్రూరు, సెప్టెంబరు 28 : కార్మిక చట్టాలపట్ల స్వాతంత్ర ఉద్యమం నుంచి నేటి వరకు పోరాడిన చరిత్ర ఏఐటీయూసీకి ఉందని కార్మికుల ప్రయోజనాల కోసం ప్రతీ ఒక్కరు కృషి చేయాలని ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్. బాలరాజు అన్నారు. శనివారం తొర్రూరులోని లయన్స్ భవన్‌లో నిర్వహించిన శిక్షణ తరగతులకు జిల్లా అధ్యక్షుడు ఓమ భిక్షపతి జెండా ఆవిష్కరించగా, శిక్షణ తరగతుల ప్రిన్సిపాల్‌గా అజయ్‌సారథి వ్యవహరించారు. నాయకులు మేకల శ్రీనివాస రావు, సీతామహాలక్ష్మి, టి.విశ్వేశ్వర రావు, నవీన్, బందు మహేందర్, భిక్షపతి, వెంకన్న, ప్రభాకర్, కిరణ్, శ్రావణ్, లక్ష్మణ్, శంకర్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో గుర్రం జాషువా జయంతి

మహబూబాబాద్ టౌన్, సెప్టెంబరు 28 : మహబూబాబాద్ హన్మంతరావునగర్ కాలనీలో కేవీపీఎస్ ఆధ్వర్యంలో శనివారం మహాకవి గుర్రం జాషువా జయంతిని నిర్వహించారు. ఆయన ఫ్లెక్సీకి పూలమాల వేసి, నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా కేవీపీఎస్ జిల్లాప్రధాన కార్యదర్శి దుడ్డెల రామ్మూర్తి మాట్లాడుతూ ఆధునిక తెలుగుపద్య కవిత్వాన్ని మరోమలుపు తిప్పిన మహాకవి గుర్రం జాషువా అని చెప్పారు. ఈ కార్యక్రమంలో శాగంటి భాగ్యమ్మ, మందుల మహేందర్, మచ్చ వెంకన్న, స్వరూప, కవిత, దుర్గమ్మ, శ్యాం, రేణుక, శంకర్, నాగమణి పాల్గొన్నారు.

• ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో శనిగపురం ఉన్నత పాఠశాలలో గుర్రం జాషువా జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆసంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చాగంటి ప్రభాకర్, గుగులోతు దేవ్‌సింగ్, సిద్ధయ్య, సునీత, హెచ్‌ఎం దాశరధి శ్రీధర్, ఉపాధ్యాయులు కావ్య, సౌజన్య, పరిమళ, విజయ్, బెనర్జీ పాల్గొన్నారు.

• నూకల రాంచంద్రారెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తెలుగు విభాగం ఆధ్వర్యంలో గుర్రం జాషువా జయంతిని నిర్వహించారు. ప్రిన్సిపల్ డాక్టర్ బి.లక్ష్మణ్‌నాయక్, సీహెచ్.శ్రీనివాసులు, అనిల్‌కుమార్, సాంబశివరావు, మసూద్ అహ్మద్, అన్నపూర్ణ, వినోద్‌కుమార్, రాజశేఖర్, హత్తిరాం, వీరు, ప్రభావతిదేవి, నాగరాజు, పూజిత, వంశీ, డీఎస్.రామన్న పాల్గొన్నారు.

• గూడూరు : మచ్చర్లప్రాథమిక పాఠశాలలో ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో గుర్రం జాషువా జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు పార్నంది రామయ్య మాట్లాడుతూ ఆధునిక తెలుగు కవిత్వంలో సమాజ అభివృద్ధి కోసం కృషి చేశారన్నారు. కార్యక్రమంలో నాయకులు మోకాళ్ల వెంకన్న, చుంచ బాలయ్య, మేడ జగ్గయ్య, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.